క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: నేతాజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని లయన్స్‌క్లబ్ భవనం ఎదురుగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నాయకుడు సతీష్ తెలియజేశారు. ఏబీవీపీ కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నేతాజీ చౌరస్తాలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించనున్నట్లు అధ్యక్షుడు జీవన్ గుండప్ప తెలియజేశారు.

నేటి నుంచి గార్లపహాడ్‌లో రిలే నిరాహార దీక్షలు

కోయిల్‌కొండ: నూతన మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటించాలని సోమవారం నుంచి గార్లపహాడ్ స్టేజి దగ్గర మండల సాధన కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు రామునాయక్, వెంకట్రామిరెడ్డి, నవీన్‌లు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు రిలే దీక్షలు కొనసాగుతాయని వారు డిమాండ్ చేశారు. ఈ రిలే దీక్షలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఎంపీ వెంకటేష్ సంఘీభావం తెలిపేందుకు రిలే నిరాహార దీక్షలో పాల్గొనేందుకు వస్తున్నారని వారు తెలిపారు. కావున చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పార్టీలకతీతంగా హాజరుకావాలని వారు కోరారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను ఆదివారం హైదరాబాద్‌లో రాష్ట్ర కుంగ్‌ఫూ అసోసియేషన్ అధ్యక్షుడు సినీనటుడు నరేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుంగ్‌ఫూ, కరాటే నేర్చుకోవడంతో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. విద్యార్థులు కరాటే నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో ఆలిండియా కుంగ్‌ఫూ ఇన్‌స్ట్రక్టర్ కృష్ణకుమార్ రాజు, జిల్లా అధ్యక్షులు ఎన్.ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కోదండపాణి, సౌత్‌జోన్ ఇన్‌స్ట్రక్టర్ కనకం యాదవ్, కోశాధికారి అంజిరెడ్డి, మధు తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి



నవాబుపేట: అమ్మా మైసమ్మ.. కోరిన కోరికలు తీర్చే మాయమ్మ అంటూ మైసమ్మ దేవత నామస్మరణ మార్మోగింది. పచ్చటి అడవిలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పక్షుల కిలకిల రావాల మధ్య అమ్మ జపంతో అడవి పులకరించింది. మండల పరిధిలోని మైసమ్మ దేవాలయంలో ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు తరలి రావడంతో ఆలయం జన జాతరల మారింది. పలువురు మహిళలు బోనాల మొక్కులు, పూజలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

జడ్చర్ల: మండల పరిధిలోని గంగాపూర్–ఆల్వాన్‌పల్లి గ్రామాల మధ్య 167 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడగా.. భార్య ఇద్దరు చిన్నారులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. మిడ్జిల్ మండలం బైరంపల్లికి చెందిన మన్నెం తన భార్య, ఇద్దరు పిల్లలతో బైక్‌పై జడ్చర్ల నుంచి బైరంపల్లికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పిల్లల మూత్ర విసర్జనకు బైక్‌ను ఓ పక్కగా నిలిపిన సమయంలో వెనుక నుంచి ఓ వ్యక్తి మద్యం మత్తులో వేగంగా వచ్చి ఆపిన బైక్‌ను ఢీకొట్టాడు. దీంతో మన్నెం తీవ్రంగా గాయపడగా ఢీకొట్టిన వ్యక్తి తన బైక్‌ను వదలి పారిపోయాడు. క్షతగాత్రుడిని చికిత్స కోసం జడ్చర్లలోని ఆస్పత్రికి తరలించారు

స్నేహితుడి కుటుంబానికి చేయూత



నవాబుపేట: అనారోగ్యంతో మృతి చెందిన ఓ మిత్రుడి కుటుంబానికి అందరు కలిసి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని జంగమయ్యపల్లికి చెందిన ముగ్గని ఆంజనేయులు (35) అనారోగ్యంతో 8 నెలలుగా చికిత్సపొందుతూ ఈనెల 14న మృతి చెందాడు. అయితే బాధితుడికి భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నారు. మండల పరిధిలోని లింగంపల్లి జెడ్పీ పాఠశాలలో 2002–03లో ఆయనతోపాటు పదోతరగతి చదివిన తోటి స్నేహితులు రూ.2 లక్షలు బాధిత కుటుంబానికి అందించి చేయూతనిచ్చారు.

సర్వర్ డౌన్!

- నతాయిస్తున్న ఎన్ఎంఎంఎస్ యాప్
- హాజరు పడక కూలీల ఇబ్బందులు
- రోజంతా శ్రమించిన శూన్యమే
- నష్టపోతున్న ఉపాధి కూలీలు



బొక్కలోనిపల్లి గ్రామ నర్సరీలో పాలిథిన్ కవర్లలో మట్టి నింపుతున్న కూలీలు (ఫైల్)



కోడూర్‌లో చెరువులోని ఒండ్రుమట్టి తరలింపులో ఉపాధి కూలీలు (ఫైల్)

మహబూబ్‌నగర్ రూరల్: జాతీయ ఉపాధిహామీ పథకంలో నూతనంగా అమలు చేస్తున్న హాజరు విధానం కూలీలను ఇబ్బందులకు గురిచేస్తోంది. నిత్యం సర్వర్ సతాయిస్తుండటంతో హాజరు పడడం లేదు. రోజంతా శ్రమించినా కూలికి దూరమయ్యే పరిస్థితి దాపురించింది. ఇదివరకు రాతపూర్వకంగా వేసే హాజరు స్థానంలో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం) యాప్ తీసుకొచ్చారు. ఈ ఏడాది జనవరి నుంచే అమలు చేస్తున్నారు.

పారదర్శకత కోసమే...

ఉపాధి పనుల్లో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ యాప్ తీసుకొచ్చింది. పాత విధానంలో లొసుగులను ఆసరా చేసుకుని కొందరు సిబ్బంది ఇష్టానుసారంగా వివరాలు నమోదు చేశారు. కూలీలు రాకున్నా వచ్చినట్లు వేయడం, పనులు కాకున్నా పూర్తి చేసినట్లు చూపడం, కొలతల్లో తేడాలు వంటివి సామాజిక తనిఖీల్లో బహిర్గతమవుతున్నాయి. కొత్త యాప్ ద్వారా కూలీల ఫొటోలను వారు పనిచేసే చోటే తీసి ఫోన్‌లో పొందుపరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం హాజరు నమోదు చేయాలి. ఒకవేళ ఆన్‌లైన్‌లో ఒక్కపూట హాజరు వేయకున్నా ఆ రోజు డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

యాప్‌లో తరచూ సర్వర్ సమస్యలు

- యాప్‌లో తరచూ సర్వర్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఉదయం హాజరు పడితే సాయంత్రం పడట్లేదు. సిగ్నల్స్ ఎప్పుడు ఉంటున్నాయో తెలియడం లేదని ఫీల్డ్ అసిస్టెంట్లు పేర్కొంటున్నారు.
- ఇదివరకు ఒక వర్క్ ఐడీ కింద పనిచేస్తున్న కూలీల సంఖ్య 20 దాటితే ఆ బృందం ఫొటో నమోదు చేసేవారు. ఇప్పుడు ఒక్కో వర్క్ ఐడీ కింద ఒక్కొక్కరి ఫొటో అప్‌లోడ్ చేయాలి.
- అంతేకాకుండా ఒక కూలీ మొదటి హాజరును నమోదు చేసిన నాలుగు గంటల తర్వాతే రెండో హాజరు తీసుకోవాలి. లేదంటే తీసుకోదు.
- ప్రస్తుతం మహబూబ్‌నగర్ రూరల్ మండల పరిధిలోని 26 గ్రామాల పరిధిలో 379 మంది ఉపాధి పనులకు హాజరవుతున్నారు. వేసవిలో మూడు నెలల పాటు నిత్యం 2,900నుంచి 3,000 మందికి పైగా వెళ్తారు. ఇంతమంది హాజరు నమోదు చేసుకోవడం ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఇబ్బందే.
- కొంతమంది ఉదయం పనులకు వచ్చి సాయంత్రం రావడం లేదు. తాము డబ్బులు పోగొట్టుకుంటున్నామనే విషయం వారికి తెలియడం లేదు.

ఇబ్బందులు వాస్తవమే



ఉపాధి కూలీల హాజరు నమోదులో ఇబ్బందులు ఎదురవుతున్న మాట వాస్తవమే. సర్వర్ సతాయిస్తుండడంతో హాజరు నమోదు చేయలేకపోతున్నామని పలువురు ఫీల్డ్ అసిస్టెంట్లు నా దృష్టికి తీసుకొచ్చారు. కూలీలకు రెండు పూటలా హాజరు నమోదైతేనే డబ్బులు వస్తాయి. ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– అమ్జద్‌ఖాన్, ఏపీఓ

భరోసా యాత్రతోనే 'ట్రామా కేర్ సెంటర్'

అడ్డాకుల: దేవరకద్ర నియోజకవర్గంలో చేపట్టిన భరోసా యాత్రతోనే మూసాపేట మండలం జానంపేట వద్ద ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి లేకపోవడంతో అత్యవసర చికిత్స అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. గతేడాది మేలో ఉచిత విద్య, వైద్యం అందించాలనే డిమాండ్‌తో 300 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో వైద్యం అందించేందుకు జాతీయ రహదారిపై ఉన్న పీహెచ్‌సీలను 100 పడకల ఆస్పత్రులుగా మార్చాలని పాదయాత్రతో పాలకుల కళ్లు తెరిపించామన్నారు. తాము చేపట్టిన భరోసా యాత్రతో దేవరకద్రలో బీసీ గురుకుల కళాశాల, జానంపేటలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



జడ్చర్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం లభించింది. బిజినేపల్లిలో నిర్వహించిన దళిత, గిరిజన ఆత్మగౌరవ సభకు ఆయన తరలివెళ్లారు. 44వ జాతీయ రహదారిపై క్రాస్ రోడ్ వద్ద మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై స్వాగతం పలికారు. గజమాలతో సన్మానించి నినాదాలు చేశారు. అయితే టీపీసీసీ నేత అనిరుధ్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికే కార్యక్రమానికి దూరంగా ఉన్నారు. జడ్చర్లలో ఆయన అక్కడక్కడ ఫ్లెక్సీలు కట్టినా కార్యక్రమానికి మాత్రం హాజరు కాకపోవడం చర్చనీయాంశగా మారింది. అదేవిధంగా అనాథ పిల్లలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జంగయ్య రేవంత్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ

అడ్డాకుల: మూసాపేట మండలంలోని వేములకి సమీపంలో ఉన్ని సహకార సంఘం షెడ్డు నిర్మాణానికి ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు జి.ఇంద్రయ్యసాగర్ భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తన నిధుల నుంచి ఉన్ని సంఘం షెడ్డు కోసం రూ.10లక్షలను కేటాయించారు. దీంతో నిర్మాణం పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. నిర్మాణ పనులను నాణ్యవంతంగా చేపట్టి సకాలంలో పూర్తి చేసే విధంగా చూడాలని జెడ్పీటీసీ ఉన్ని సంఘం సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అరుణ, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహ, నాయకులు రఘుపతిరెడ్డి, కొండయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఉన్ని సంఘం షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు ఇంద్రయ్యసాగర్

వెంచర్ బాధితుల నిరసన

జడ్చర్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వెంకటాద్రి వెంచర్ సీ బ్లాక్ బాధితులు ఆదివారం ఫిర్యాదు చేశారు. బిజినేపల్లి బహిరంగ సభకు హాజరయ్యేందుకు వెళ్తున్న ఆయనకు జడ్చర్ల క్రాస్ రోడ్ వద్ద బాధితులు వినతిపత్రం సమర్పించారు. అంతకు ముందు బాధితులు మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మి ఇంటి ఎదుట ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే అప్పటికే స్థానిక సీఐ రమేశ్‌బాబు అక్కడకు చేరుకుని బాధితులను సముదాయించి వెనక్కి పంపించారు. తమ ప్లాట్లను చదును చేసిన వ్యక్తి సందీప్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు జనార్దన్‌రెడ్డి తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చదును చేసిన జేసీబీని స్వాధీనం చేసుకుని చర్యలు చేపడుతామని సీఐ వారికి హామీ ఇచ్చారు. బాధితులు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దని, సమస్య పరిష్కారానికి కృషి చేద్దామని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బాధితులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు ఆయన ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

మార్మోగిన శివనామస్మరణ



రాజాపూర్: మండల పరిధిలోని చెన్నవెల్లిలో ఆదివారం శివస్వామి లక్ష్మీనారాయణ నివాసంలో శివగురుస్వామి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ద్వాదశజ్యోతిర్లింగా మహాపడిపూజ కార్యక్రమంతో చెన్నవెల్లి శివనామస్మరణతో మార్మోగింది. శివభక్తులు శివమాల ధరించి భక్తిశ్రద్ధలతో మండల దీక్ష చేపట్టి నియమాలతో శివస్వాములు ఆలపించిన భక్తి గీతాలు ఎంతో అలరించాయి. ఈ సందర్భంగా శివలింగానికి అభిషేకం, పడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

మిడ్జిల్: మండల కేంద్రానికి చెందిన అంజలి(19) నసర్లబాద్‌కి చెందిన నరేష్(22) ప్రేమించుకున్నారు. అయితే వివాహానికి ఇరు కుటుంబాలు అడ్డు చెప్పడంతో ఈనెల 18వ తేదిన ఇంటి నుంచి వెళ్లిపోయి శ్రీశైలంలో వివాహం చేసుకున్నారు. యువతి తల్లి పోలీసులకు గురువారం ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఆదివారం ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించారు. ఎస్ఐ ఇరు కుటుంబాల పెద్దలను సమాచారం ఇవ్వడంతో వారంతా స్టేషన్ లో మాట్లాడి ఇద్దరిని అబ్బాయి ఇంటికి తీసుకెళ్లారు.

ఎంఎంఎస్‌లో గందరగోళం!

- ఖాళీ చెక్కులపై సంతకాల సేకరణ
- ఇష్టారాజ్యంగా సభ్యుల నియామకం
- మళ్లీ తొలగింపునకు అధ్యక్షురాలిపై ఒత్తిడి

హన్వాడ: మండల మహిళా సమాఖ్యలో అయోమయం నెలకొంది. గతేడాది మండల సమాఖ్యకు నూతన సభ్యుల నియామకం చేసి ఇప్పుడు ఏడాది గడవక ముందే తొలగింపునకు సమాఖ్య అధ్యక్షురాలిపై ఒత్తిళ్లు మొదలయ్యాయి. ఇదేంటని అడిగితే పదవీకాలం ఏడాదికంటే ఎక్కువ లేదని బుకాయిస్తున్నట్లు మండల సమాఖ్య ఏపీఎం పేర్కొనడం గమనార్హం. ఇంతకుముందు ఉన్న సభ్యులందరూ పదవీకాలం రెండేళ్లు కాగా కొత్తగా ఏడాదిపాటే కొనసాగడం పట్ల కొత్తగా ఎన్నికైన సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంఎంఎస్ అధ్యక్షురాలు బ్యాగరి తులసి ఈ విషయమై అధికారులను నిలదీయడంతో అధికారులు కొత్త ట్విస్టులు ఇస్తున్నారు. సదరు అధ్యక్షురాలు గ్రామ సంఘంలో అధ్యక్షురాలిగా లేనికారణం చూపుతూ.. మరోవైపు కేవలం పదవీకాలం ఏడాదితో ముగిసింది అంటూ పేర్కొంటున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ విషయాన్ని అధికారులు ఎక్కడా బయటపడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా సభ్యుల నియామకం, నిధుల వినియోగంపై సంబంధించిన సర్క్యూలర్‌లను ఇటీవల కార్యాలయాన్ని సందర్శించిన విలేకరులకు ఇవ్వకపోవడం, సరైన అవగాహన లేకపోవడం పట్ల అధికారుల తీరుపై పలు అనుమానాలకు తావిస్తోంది.

20 చెక్కులపై సంతకాలు..

ఇటీవల కార్యాలయ అకౌంటెంట్ మొత్తం 20 ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకున్నట్లు ఎంఎంఎస్ అధ్యక్షురాలు బ్యాగరి తులసి ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ చెక్కులపై ఎందుకు సంతకాలు తీసుకున్నారు..? ఏ నిధులు డ్రా చేశారు..? అని ఏపీఎంను నిలదీయడంతో ఎంఎంఎస్‌లో గందరగోళం ఏర్పడినట్లయింది. ఇదంతా ఏపీఎంకు తెలిసి జరిగిందని, ఏపీఎం, సీసీలు, కార్యాలయ సిబ్బంది కుమ్మక్కై సమాఖ్యలో ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడిందని ఆమె పేర్కొనడం గమనార్హం. వీరికి జిల్లా అధికారిని డీపీఎం సైతం మద్దతుగా నిలుస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లా అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి హన్వాడ ఎంఎంఎస్‌లో ఏర్పడిన గందరగోళంపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుని సమాఖ్యను గాడిన పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



మండల మహిళా సమాఖ్య భవనం

చెక్కుల విషయం తెలియదు



మండల సమాఖ్య అధ్యక్షురాలు గతంలో 20 చెక్కులపై సంతకాలు చేసిన విషయం నాకు తెలియదు. నేను ఇటీవలే వచ్చా. కేవలం రెండు చెక్కులపై మాత్రమే అధ్యక్షురాలి నుంచి సంతకాలు తీసుకున్నా. ఇందుకు సంబంధించి డ్రా చేసిన డబ్బులను ఆఫీస్‌లో ఫర్నీచర్‌కు వినియోగించాం. వీటి ఖర్చుల కోసం ఎంత డబ్బులు డ్రా చేశానో డైరీలో చూసిచెప్పాల్సి ఉంది.

– విష్ణుచారి, ఏపీఎం, హన్వాడ

ఏపీఎంకు తెలిసే జరిగింది



అందరూ ప్రోత్సహించి అధ్యక్షురాలిని చేశారు. ఇప్పుడు పదవీకాలం ముగిసిందని అంటున్నారు. ఏమి అర్థం కావడం లేదు. నా నుంచి 22 ఖాళీ చెక్కులపై సంతకాలు తీసుకున్నారు. ఖర్చులేవీ చెప్పడం లేదు. కార్యాలయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఏపీఎంకు అన్నీ తెలిసి నన్ను తప్పుదారి పట్టిస్తున్నారు.

– బ్యాగరి తులసి, ఎంఎంఎస్ అధ్యక్షురాలు

సర్పంచ్‌పై సస్పెన్షన్ ఎత్తి వేయాలి



మాట్లాడుతున్న దోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి

భూత్పూర్: మండలంలోని అన్నసాగర్ సర్పంచ్ కరెంట్ నీలిమను అక్రమంగా సస్పెండ్ చేయడం సరైంది కాదని బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. సర్పంచ్ నీలిమ అక్రమ సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తు ఆదివారం భూత్పూర్ మండలంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నసాగర్ సర్పంచ్ అవినీతికి పాలుపడిందని అధికారులు గతేడాది ఆగస్టులో షోకాజ్ నోటీసులు అందించారన్నారు. అధికారులు ఇచ్చిన నోటీసులకు ఎలాంటి అవినీతి జరగలేదని ఆమె వివరణ ఇచ్చిందన్నారు. కానీ అధికారులు ఆమె వివరణను పట్టించుకోకుండా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. ఎమ్మెల్యే రాజకీయ కక్ష సాధింపుల కోసం అధికారులు ఇలాంటి దుర్మార్గపు చర్యకు పాలుపడడం సరికాదన్నారు. వెంటనే సర్పంచ్ సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. లేని యడల బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కరెంట్ నరసింహులు, ఫారూక్, రాజగోపాల్‌రెడ్డి, గూటం శ్రీనువాసులు, రాజు పాల్గొన్నారు.

రోస్టర్ మెరిట్ ఆధారంగా సీనియార్టీ జాబితా చేయాలి



నియామక పత్రం అందజేస్తున్న కృష్ణుడు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రస్తుతం చేపడుతున్న బదిలీలు, ప్రమోషన్‌లలో భాగంగా సీనియార్టీ జాబితాను కేవలం మెరిట్ ఆధారంగా చేస్తున్నారని, దీంతో బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అందుకోసం రోస్టర్ మెరిట్ ఆధారంగా చేయాలని బీసీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు కృష్ణుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బీసీ సంఘం భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బీసీ ఉపాధ్యాయులు సీనియార్టీ జాబితాను తయారు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే అధికారులు ప్రభుత్వం స్పందించి సీనియార్టీ జాబితా తయారీలో మార్పులు చేపట్టాలన్నారు. బదిలీలు, పదోన్నతులలో ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పూర్తి స్థాయిలో పారదర్శంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. స్పౌజ్ ఉపాధ్యాయులపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుని వారిని న్యాయం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ సలహాదారుడిగా అబ్దుల్‌రజాక్, ఉపాధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌లను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రమేష్, గురుప్రసాద్, రాఘువేందర్ తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా చేపట్టాలి



మాట్లాడుతున్న సయ్యద్ జలీలుద్దీన్

స్టేషన్ మహబూబ్‌నగర్: త్వరలో చేపట్టనున్న ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని ఆల్‌వేస్ ప్రొగ్రెసివ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ రఫీక్, సయ్యద్ జలీలుద్దీన్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివారం ఏపీయూటీఏ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదోన్నతులు, బదిలీల్లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఇతర మీడియం ఉపాధ్యాయుల మాదిరిగా ఉర్దూ మీడియం టీచర్ల సీనియార్టీ జాబితాను బహిరంగంగా ప్రకటించాలని కోరారు. గతంలో చేపట్టిన పదోన్నతులు, బదిలీల్లో ఉర్దూ మీడియం ఉపాధ్యాయుల సీనియార్టీ లిస్టులో అన్యాయం జరిగిందన్నారు. సీనియార్టీ ప్రకారం ఉర్దూ మీడియం ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆల్‌వేస్ ప్రొగ్రెసివ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ ఉపాధ్యక్షులు అహ్మద్ మొహియోద్దీన్, కోశాధికారి మహ్మద్ యూనుస్, మీడియా కార్యదర్శి అబ్దుల్ వాసే, మహిళా విభాగం ప్రతినిధి నఫీర్ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లికి చెందిన పూర్వ విద్యార్థి శ్రీనివాస్‌సాగర్‌కు పూర్వ విద్యార్థులందరు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. 1988–89లో అడ్డాకుల మండలంలోని కందూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీనివాస్‌సాగర్ పదో తరగతి చదివాడు. కొన్నేళ్ల నుంచి ఆయన తీవ్ర అనారోగ్యానికి గురై కొమిరెడ్డిపల్లిలోని ఇంటి వద్దే ఉంటున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో పదో తరగతి పూర్వ విద్యార్థులు రూ.50వేలను పోగు చేశారు. ఆదివారం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు. అనంతరం నగదును అందజేసి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, కందూర్ సర్పంచ్ శ్రీకాంత్, కుపేందర్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, జగదీశ్వరాచారి, ఉమేష్, వీరేందర్, లక్ష్మయ్య, రాములు, నరేందర్‌రెడ్డి, శేషయ్య ఉన్నారు.

ఆర్యవైశ్యులకు విద్యారుణాలు



విద్యారుణాలు అందజేస్తున్న సోమ భరత్‌కుమార్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి సీఎం కేసీఆర్ అవకాశాలు ఇస్తున్నారని రాష్ట్ర డైరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ సోమ భరత్‌కుమార్ అన్నారు. శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని వాసవీ ఫంక్షన్‌హాల్‌లో 101 మంది విద్యార్థులకు రూ.28లక్షల వడ్డీలేని విద్యారుణాలు పంపిణీ చేశారు. ఆయనతోపాటు ఉప్పల శివకుమార్ ఐపీఎస్, ఇంటలిజెన్స్ ఓఎస్‌డీ హాజరయ్యారు. కార్యక్రమంలో శ్రీవాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ అధ్యక్షుడు మలిపెద్ది శంకర్, ప్రధాన కార్యదర్శి కండె కుమారస్వామి, కోశాధికారి కలకొండ సూర్యనారాయణ, సలహాదారు గుండ్ల కృష్ణయ్య, జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పాలాది రాంమోహన్, పట్టణ ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి మిర్యాల వేణుగోపాల్, శ్రీవాసవీ విద్యా వసతి గృహం అధ్యక్షుడు కొండ చక్రధర్‌గుప్త పాల్గొన్నారు.

ఆనంద్‌కుమార్‌కు 'శివనంది' అవార్డు



అవార్డును అందుకుంటున్న ఆనంద్‌కుమార్

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వివిధ రంగాల్లో చేసిన విశిష్ట సేవలకు శ్రీ లక్ష్మీ నారాయణ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు మణి ఆనంద్‌కుమార్ శివ నంది అవార్డును అందుకున్నారు. శ్రీ వాగ్దేవి సంగీత నృత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కోదాడలో అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం జరిగింది. ఆ సంస్థ చైర్మన్ రాఘువేందర్‌యాదవ్ చేతుల మీదుగా ఆయన అవార్డులను అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవార్డులను అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. తమ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిరాశ్రయులకు చేయూత నివ్వడంతోపాటు ఆకలితో ఉన్న వారికి అన్నదాన కార్యక్రమాలు చేశారన్నారు. అందుకు గాను తనకు ఈ అవార్డు లభించిందని తెలిపారు. అ వార్డును అందు కోవడంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు.